స్నేహ మాసపత్రిక (జులై 77)

# విలువలు

"…. పాపం, ఇంత జబ్బు రావల్సిన వయస్సు కాదు. ఇంతా చేసి ఆ అమ్మాయికి పాతికేళ్ళు…" సత్యనారాయణ మాటలు సుబ్బరాజుకి వినిపించి చకితుడయ్యాడు. చేస్తున్న పని ఆపి చెవులు రిక్కించి వినసాగాడు.

సత్యనారాయణ టేబుల్ చుట్టూ సహోద్యోగులు గుమిగూడారు. కుతూహలంతో రకరకాల ప్రశ్నలు వేస్తున్నారు. గొంతు నిండిన సానుభూతితో ఆ అమ్మాయి కథ చెపుతున్నాడు సత్యనారాయణ.

"అందం ఉంది. ఐశ్వర్యం ఉంది. ప్రేమించే భర్త ఉన్నాడు. రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలున్నారు. పేరు ప్రఖ్యాతులున్న గొప్పింటి కోడలు. దేనికీ లోటు లేదు. తీరని కోరికలంటూ ఉండటానికి ఆస్కారం లేదు. కాని, ఏ జీవితానికయినా ముఖ్యంగా కావల్సింది ఆరోగ్యం! ఆ పిల్లకిప్పుడు అదే కరువయింది!

చిన్నప్పుడు వచ్చిందా గుండెజబ్బు. అప్పుడేదో ఆపరేషన్ చేసి నయం చేసారు. తర్వాత ఎలాంటి బాధా కలగలేదు. ఏడాది క్రితం వరకూ… అసలొకప్పుడు ఆ జబ్బుతో ఆమె బాధపడిన విషయమే మర్చిపోయారు కన్నవాళ్ళు. అత్తింటి వారికా సంగతే తెలియదు. కాని, మళ్ళీ జబ్బు వచ్చాక అంతా అందరికీ తెలిసింది. మళ్ళీ ఆపరేషన్ చేయాలన్నారు డాక్టర్లు. ఆమె బ్లడ్ గ్రూపు అసాధారణంగా ఉంది. జనరల్‌గా బ్లడ్‌బ్యాంకులో దొరకటం కష్టం! చిన్నప్పుడు ఆపరేషన్ జరిగినప్పుడు ఇటువంటి సమస్యే యెదురయింది. అప్పుడెలాగో ఆ గండం గడిపారు…. అలాగే, ఏడాది క్రితం అనేక బ్లడ్ బ్యాంక్‌లనుంచి ఆ గ్రూపు రక్తం తెప్పించి ఆపరేషన్ చేశారు. అప్పుడు పరిస్థితి కొంచెం మెరుగుపడింది. కాని మరోసారి మేజర్ ఆపరేషన్ చేస్తేనే కాని పూర్తిగా నయం కాదన్నారు డాక్టర్లు. మళ్ళీ ఎటాక్ రాకముందే చేయాలి. లేకపోతే, బ్రతకటం కష్టం అని చెప్పేశారు. ప్రస్తుత సమస్య ఆ గ్రూపు రక్తం కావలి… అదే సాధ్యం కావటం లేదు. పత్రికల్లో బహుమతులు ప్రకటించినా ప్రయోజనం లేకపోయింది. ఎవరో కాని ముందుకు రావటం లేదు. వచ్చినవాళ్ళ రక్తం ఆమె గ్రూపుకి సరిపోవటం లేదు. ఎక్కడెక్కడికో తీసుకువెళ్ళారు. ఎంత మంది స్పెషలిస్టులకి చూపించినా మాట అదే! సమస్య అదే! అమ్మాయి బ్రతకాలంటే ఆ గ్రూపు రక్తం కావాలి!

"… ప్రపంచంలో మేధావులు ఇప్పుడెన్నో కనిపెడుతున్నారు. పిల్లల్ని కనటం మినహా మనుషులు చేసే పనులన్నీ కంప్యూటర్లు చేస్తున్నాయి. కాని, మనిషిక్కావల్సిన రక్తం తయారు చేయలేకపోతున్నారు! ఛ్!" అని పెదవి విరిచాడు పరాంకుశం.

"దీనికి యంత్రాలక్కర్లేదోయ్! మనుషుల్లోనే కావల్సినంత రక్తం తయారవుతోంది. మనం

కొంత స్పేర్ చేస్తే వాళ్ళ ప్రాణాలు నిలబడతాయి!" అన్నాడు సత్యనారాయణ.

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

"ఆ సంగతి విని నాకు చేతనయింది నేను చేద్దామని వెళ్ళాను. దురదృష్టం కొద్దీ నా రక్తం సరిపోలేదు.." అని అందర్నీ కలయజూసాడతను.

సత్యనారాయణ అప్పటికప్పుడు తన గుండె కోసేసి సీసాల నిండా నింపి రక్తం పట్టుకు పోతాడేమోనన్నట్టు గబగబా తన సీట్లోకి పోయాడు పురుషోత్తం.

"నాది ఆ గ్రూపురక్తం కాదోయ్!" అని వెళ్ళిపోయాడు తన రక్తం ఎప్పుడూ పరీక్షించుకోని వెంకటరత్నం. "నేనసలే బక్కాడ్ని..." అని వెకిలిగా నవ్వి, త్వరత్వరగా నిష్క్రమించాడు పరాంకుశం... ఇలాగే పరాయివాళ్ళ కష్టగాథలు 'కమ్మగా' వినటానికి ఇష్టపడినవాళ్ళంతా తమ దాకా వచ్చేసరికి గడుసుగా తప్పించుకుపోయారు.

"నాదంతా కంఠశోష!" అని చిరాగ్గా ఫైల్లో తలదూర్చాడు సత్యనారాయణ. అతని మాటలు విన్నాక ఎంతో కాలంగా చీకటి పేరుకున్న సుబ్బరాజు మనస్సులో చిన్న జ్యోతి వెలిగింది! అతని దగ్గరకి వెళ్ళి "ఆ అమ్మాయి బ్లడ్ గ్రూప్ ఏమిటన్నావు బాబూ!" అని ఆత్రంగా అడిగాడు.

అతను చిత్రంగా నవ్వి "ఎందుకు? మీరిస్తారా రక్తం" అని అడిగాడు.

అప్రయత్నంగా తలవూపి "సరిపోతే ఇద్దామని" అన్నాడు సిగ్గుపడిపోతూ.

అంతా తలోమూలా వ్యంగ్యోక్తులు విసిరి బాధించారే కాని...చిత్తశుద్ధితో సుబ్బరాజు ముందుకు వచ్చాడని గుర్తించలేదు. అయినా, అందుకతను నొచ్చుకోలేదు. ఇలా నలుగురిచేతా అకారణంగా మాటలు పడటం అతని జీవితంలో క్రొత్తేమీ కాదు!

చేతకంది వచ్చిన పెద్దకొడుకు, ఇక నుంచి తన బాధ్యతలు కొంచెం పంచుకుంటాడని ఆశిస్తే... ఉన్నట్టుండి కులాంతర వివాహం చేసుకొని ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. కొడుకుని అదుపులో పెట్టుకున్నావు కాదని నలుగురూ నానా మాటలూ అన్నారు.

కాలంతో పాటు పట్టు విడుపులుండాలని, కొడుకుకి కబురంపి రప్పించుకుందామను కుంటే, "కూతుళ్ళకి సంబంధాలు రావ"ని అంతా తలోమూలా పోరు పెట్టారు. చివరికి భార్య కూడా సంఘానికి భయపడి గుండె రాయి చేసుకోమంది.

వచ్చిన 'మచ్చ' అంతటితో సరిపెట్టక తర్వాత కూడా చెడు ఫలితాలనిస్తూనే ఉంది. ఆడపిల్లలకి వస్తాయనుకున్న సంబంధాలు, రానూ లేదు. వచ్చి చూసి వెళ్ళినవాళ్ళు మళ్ళీ కబురు పెట్టనూ లేదు. ఓ మూల వాళ్ళ పెళ్ళిళ్ళు కావటం లేదని దిగులు పడుతుంటే చిన్న కొడుక్కి పిల్లనిద్దామనుకున్న మేనమామ –

"ఇంకెంతకాలం మీ అమ్మాయిలకోసం మా అమ్మాయి పెళ్ళాపుకోమంటారు. ఇష్టం లేకపోతే చెప్పండి. మరో సంబంధం చూస్కుంటాం!" అని పీకల మీదకి వచ్చి కూర్చున్నాడు.

తన యిష్ట ప్రకారం తండ్రి పెళ్ళి చేసాడన్న కృతజ్ఞతయినా లేకుండా – కన్నవాళ్ళ

కష్టంలో అండగా నిలవడం పోయి - మేనమామ నేర్పి పెట్టాడో, మరి భార్యే నూరిపోసిందో, అభిమానాలు మర్చిపోయి అనుబంధాలు త్రెంచుకొని ఉన్న వూళ్ళోంచి బదిలీ చేయించుకొని, దూరంగా వెళ్ళిపోయాడు చిన్న కొడుకు! తన స్వార్థం చూసుకోవటంలో ఆ అన్నకు తమ్ముడనిపించుకున్నాడు. అందుకూ, సుబ్బరాజునే తప్పు పట్టారు లోకులు.

కొడుకులలా దూరమైపోయి కూతుళ్ళిలా గుండెల మీద కుంపట్లయి కూర్చుండిపోతే, భార్య బెంగతో మంచం పట్టింది. కూతుళ్ళ పెళ్ళికి నిల్వ చేసిన డబ్బు, భార్య జబ్బు కోసం నీళ్ళలా ఖర్చు పెట్టాల్సి వచ్చింది. అతనిచ్చే ధైర్యం ఆమె పరిస్థితిని మెరుగుపరచలేదు కాని, ఆమె అనారోగ్య స్థితి అతని అశాంతిని మాత్రం పెంచింది... ఆ తర్వాత సంబంధాలు కుదిరినా కూతుళ్ళ పెళ్ళిళ్ళు చేయలేని స్థితిలోకి వచ్చాడతను!

ఇంకెప్పటికీ తండ్రి పెళ్ళి చేయలేదనుకుందేమో - ఒక ఉత్తరం వ్రాసి పెట్టి ఎవరితోటో వెళ్ళిపోయింది పెద్దకూతురు. ఆ అఘాతానికి అతని భార్య బలహీనమైన గుండె తట్టుకోలేక పూర్తిగా ఆగిపోయింది! ఒక్కసారిగా ముంచుకొచ్చిన ఈ ఉపద్రవాలతో ప్రాణాలు కడట్టి ఓ మూల విలపిస్తుంటే... చేతకానివాడని, చేజేతులా జీవితం నరకం చేసుకున్నాడని లోకులు కత్తుల్లాంటి మాటలతో గుండెకోత కోసారు.

"నేనేం పాపం చేసానమ్మా! ఎందుకు నన్నిలా అందరూ వదలిపోతున్నారు?" అని చంటిపిల్లాడిలా ఏడిచాడతను.

"ఎవరు నిన్ను విడిచి వెళ్ళినా నిన్ను నేను విడిచిపెట్టను నాన్నా!" అని కన్నతల్లిలా సాకి ధైర్యం చెప్పింది చిన్నకూతురు.

ఆమె అభిమానంతో గతమంతా మరచి సరిక్రొత్త జీవితాన్ని గడుపుదామనుకున్నాడు. తన ప్రాణాలన్నీ ఆ పిల్లమీదే పెట్టుకొని క్రొత్త జీవితం అరంభించాడు. కాని... కొన్నాళ్ళకే ఆ చివరి ఆశ కూడా అతనిలో అంతరించిపోయేలా... బజారు నుంచి వస్తున్న అతని కూతుర్ని ఓ లారీ వచ్చి గుద్దేసింది.

రక్తపు మడుగులోంచి ఆమె నెత్తుకువెళ్ళి హాస్పిటల్లో చేర్చారు. ప్రాణాలు నిలబెట్టటానికి రక్తం అవసరమైంది. ఆమె గ్రూపుకి చెందిన రక్తం సరిపడినంత హాస్పిటల్లో లేకపోయింది. తన రక్తం తీసి తన బిడ్డ ప్రాణాలు కాపాడమని డాక్టర్లని వేడుకున్నాడతను. అతనివ్వగలిగిన రక్తం ఇచ్చాడే కాని... ఆ పిల్లకి ప్రాణాలు పోయలేకపోయారు డాక్టర్లు!

అంతే! ఆ తర్వాత అతని జీవితం పూర్తిగా చీకటిమయమై పోయింది. ఇంకెందుకు బ్రతకాలో అతనికర్థం కాలేదు. జీవితానికి ముగింపు చెప్పుకుందామని అనేకసార్లు ప్రయత్నించాడు. కాని, ప్రతిసారీ ఏదో ఒక ఆటంకం వచ్చింది.

కాని, తన గురించి తెల్సినవాళ్ళు తన దౌర్భాగ్యానికి తానే కారకుడన్నట్టు అతన్ని హేళన చేస్తున్నారు. అందుకనే తానొకరికి సహాయం చేద్దామని ముందుకు రావటం కూడా ఒక పరిహాసానికే గురయింది... ఇప్పుడూ అదే జరిగింది. కాని, వాళ్ళ మాటలేవీ పట్టించు

కోలేదతను. అతని మనస్సంతా సుశీల అనే, ఆ అమ్మాయి మీదనే ఉంది. అప్పుడు తన కూతురికి రక్త ప్రదానం చేసినా బ్రతకలేదు. పోనీ, ఇప్పుడీ అమ్మాయికి రక్తదానం చేస్తే బ్రతకుతుందేమో!

"…. చెప్పండి సత్యనారాయణ గారు?"

అంతమంది అన్ని విధాల హేళన చేస్తున్నా… ఇంకా అక్కడ నిలబడి అదే ప్రశ్న మళ్ళీ వేసిన సుబ్బరాజుని చూసి అబ్బుపరడుతున్న సత్యనారాయణ చెప్పాడు.

సుబ్బరాజు ముఖం వికసించింది. "నా బ్లడ్ గ్రూపు కూడా అచ్చం అదే!"

"రక్తం ధారపోయటానికి ఇంత పరమానందపడే వాళ్ళెక్కడయినా ఉంటారా?" ఈ మాటు పాడు నోళ్ళు కూడా మాటలు రాకపడిపోయాయి.

● ● ●

సుబ్బరాజుని చూసేసరికి సుశీలబంధువులకి దేవుడే ఆ రూపంలో దిగి వచ్చాడని అనిపించిన మాట వాస్తవం. కాని, సుశీల ఆపరేషన్‌కి కావల్సినంత రక్తం అతన్నుంచి ఒకేసారి తీసుకోవటానికి పెద్ద వయస్సని వెనుకాడారు డాక్టర్లు.

"నాకెవ్వరూ లేరు. నా జీవితం ఇంకెవ్వరికీ ఉపయోగపడనిది – బహుశ నేనింతకాలం బ్రతికింది ఇందుకోసమే అయివుంటుంది. నిస్సంకోచంగా, మీకు కావల్సినంత రక్తం తీసుకోండి. ఆ పిల్లని కాపాడండి… ఆ పిల్లల తల్లిని కాపాడండి! ఆలస్యమైతే తర్వాత ఆమె కేదయినా కావచ్చు. అప్పుడు నేను బ్రతికుండి కూడా ప్రయోజనం లేదు! జీవితమంతా ముందున్నది ఆమెకి… ఇంకే జీవితమూ లేనివాడ్ని నేను. నా మాట వినండి. ఆ రిస్కు నేను తీసుకుంటాను. నాకిష్టమై నేనిచ్చినట్టు డిక్లరేషన్ వ్రాసిస్తాను!"

ఇలా వాదించిన సుబ్బరాజుని కాదనే శక్తి ఎవరికీ లేకపోయింది.

సుశీలకాపరేషన్ యేర్పాట్లు జరిగాయి. బ్లడ్‌బ్యాంక్ నుంచి ముందే రక్తం తెప్పించి ఉంచారు. కాని, యెక్కువ రక్తాన్ని సుబ్బరాజు నుంచి తీసుకోవల్సివచ్చింది డాక్టర్లకి. సుశీల కాపరేషన్ మధ్యలో ఉండగా సుబ్బరాజుకి స్పృహ తప్పిపోయింది. డాక్టర్లకి క్రొత్త సమస్య యెదురయింది. మరింత రక్తాన్ని తీసుకుంటే అతని ప్రాణానికే మోపం రావచ్చు. అలాగని ఊరుకుంటే ఆపరేషన్ పూర్తి కాదు. సుశీల బ్రతకటం దుర్లభం! ఆ పైన అనుమతి అడగటానికి సుబ్బరాజుకి సంబంధించిన వాళ్ళెవరూ లేరు.

డాక్టర్లు తమలో తాము సంప్రదించుకున్నారు. "సుబ్బరాజు వ్రాసిచ్చింది కేవలం డిక్లరేషన్ మాత్రమే కాదు. సుశీలని బ్రతికించటం కూడా అతని ఆశయం!" అన్న నిర్ణయానికి వచ్చారు.

సుశీలకి ఆపరేషన్ జయప్రదంగా జరిగింది. ఆ తర్వాత ఆమె మంచం దగ్గిరకన్న ఎక్కువసేపు సుబ్బరాజు మంచం దగ్గర ఉండాల్సి వచ్చింది డాక్టర్లకి!

అంత రక్తం తీసుకున్నాక అతనిక బ్రతకడనే అనుకున్నాడు డాక్టర్లు. తమ ధర్మం తాము నిర్వర్తించుకోవాలన్నట్టు అతన్ని కనిపెట్టి సేవచేసారు. పదిరోజుల వరకు స్పృహలోకి

రాలేకపోయిన అతను, మృత్యు ద్వారం దాకా వెళ్ళి బ్రతికి వెనక్కి వచ్చాడు. డాక్టర్లకది ఆత్యాశ్చర్యం కలిగించింది. అతని ఆత్మశక్తి అతన్ని బ్రతికించి ఉండాలనుకున్నారు.

● ● ●

సుశీల పునర్జన్మతో, పూర్ణారోగ్యంతో ఇంటికి వెళ్ళింది. సుబ్బరాజు కూడా పునర్జన్మ యెత్తి మనస్సు నిండా క్రొత్త వెలుగు నింపుకొని ఇంటికి వచ్చాడు.

అతనిలో నెలకొన్న శాంతిని, అనుభవిస్తున్న సుఖాన్ని ఎవ్వరూ గుర్తించలేదు. అతను చేసిన త్యాగాన్ని గుర్తించి గౌరవించే వాళ్ళంతకుముందు లేరు. పైగా, సుశీల వాళ్ళవాళ్ళ నుంచి డబ్బు తీసుకోనందుకు బ్రతుకుతెరువు చేతకాని వెర్రివాడని అంతా హేళన చేసారు. ఒకవేళ, అతనే తీసుకొని వుంటే, డబ్బు కోసం రక్తాన్నమ్ముకున్నాడని వాళ్ళే అవే నోళ్ళతో అని వుండేవారు. అందుకనే, ఎప్పటిలా ఎవరి మాటల్నీ అతను పట్టించుకోలేదు.

తను వెలిగించినది చిన్నదీపమే అయినా, ఇప్పుడది అతని మనస్సులోని చీకటినంతా తొలగించి వేసింది. ఆ దీపం సుశీల! 'పునర్జన్మ నాకిచ్చిన తండ్రి మీరు' అనే సుశీల... ఇంటికి వెడితే చాలు 'తాతయ్య వచ్చారర్రా! అని పిల్లల్ని పిలిచే సుశీల! వారం వారం అతనికి తన క్షేమం తెలుపుతూ ఉత్తరాలు వ్రాసే సుశీల... ఇప్పుడతనికి ఆమె దేవుడిచ్చిన కూతురు. జీవితేచ్ఛ కలిగించింది. గతం వేసిన చీకటి ముద్రల్ని మనస్సు నుంచి తుడిచి వేసింది.

చూస్తుండగా ఏడాది టక్కున తిరిగి వచ్చింది. ఈ లోగా అతను నాలుగుసార్లు వాళ్ళూరు వెళ్ళి సుశీలని చూసి వచ్చాడు. క్రితంసారి వెళ్ళినప్పుడు "ఒక్కసారి, ఈ పేదతండ్రి ఇంటికి వచ్చి వెళ్ళవామ్మా!" అని అడిగితే, ".. అంత కన్న నాకే భాగ్యమూ లేదు నాన్న గారూ!" అంది సుశీల.

తను పునర్జన్మ యెత్తి ఏడాది అయిందని, తన పుట్టిన రోజు పండుగ జరుపుకుంటున్నావని సుశీల ఉత్తరం వ్రాస్తే, సంబరపడుతూ ప్రయాణమయ్యాడతను. తిరుగు ప్రయాణంలో తన తో రావటానికి సిద్ధంగా ఉండమని సుశీలకి ముందే జవాబు వ్రాసాడతను.

ఇల్లు దులిపించి, వెల్ల వేయించి కడిగించి, ముగ్గులు పెట్టించి, అంతా సర్దించి ఇరుగూ పొరుగూ బుగ్గలు నొక్కుకుంటుంటే, తనెంతో పరమానందపడిపోతూ ప్రయాణమయ్యాడు. ఇది వరకు ఎవరేమడిగినా మాట్లాడనివాడు ఈ మాటు అమ్మాయిని తీసుకువస్తున్నాను అని పక్కింటి వాళ్ళతోను ఆఫీసు వాళ్ళతోనూ పేరు పేరునా పిల్చి చెప్పి మరీ బయలుదేరాడు. ఇన్నాళ్లూ తనను చూసి చూపించి హేళన చేసిన వాళ్ళు, ఇప్పుడు తన అదృష్టాన్ని చూసి అసూయ పడుతున్నారని గుర్తించి, మురిపెంగా తనలో తను నవ్వుకుంటూ బయలుదేరాడు.

● ● ●

ఆ మహాభవనం ముందు చాలా కార్లు ఆగి వున్నాయి. సుశీల పుట్టిన రోజు వేడుకలు గొప్పగా జరుగుతున్నాయి కాబోలు! అని సంబరపడిపోతూ లోపలికి వెళ్ళబోయాడు సుబ్బరాజు.

ఘూర్ఖా చెయ్యి అడ్డుపెడితే తెల్లబోయాడు. "నేను.. సుబ్బరాజునయ్యా!"

"తెల్సు బాబూ! తమర్రాగానే అయ్యగారు కబురుపెట్టమన్నారు!" అని చెప్పి, పనివాడ్ని ఒకడ్ని పిలిచి కబురు చెప్పాడు ఘూర్ఖా.

మరి కాసేపట్లో సుశీల తండ్రి కృష్ణస్వామి బయటికి వచ్చాడు. సుబ్బరాజుని ఇంటి వెనుకనున్న మారుమూల గదిలోకి తీసుకువెళ్ళాడు. టిఫినూ, కాఫీలు సిద్ధమయ్యాయి.

అక్కడికి తీసుకువచ్చినందుకు తెల్లబోతూ "అమ్మాయి యేది బాబూ!" అని ఆత్రుతగా అడిగాడు సుబ్బరాజు.

"హాల్లో ఉంది. గొప్ప గొప్ప వాళ్ళంతా వస్తున్నారు?"

అతని మనస్సు చివుక్కుమంది. అక్కడికి తన్ను తీసుకువెళ్ళేలా లేడు ఆయన. తీసుకువెళ్ళమని అనలేదు అతను. "ఒక్కసారి అమ్మాయిని నేను చూడకూడదా బాబుగారూ" అన్నాడు.

"చూడచ్చు. దానికి ముందు మీతో ఒకమాట చెప్పాలి నేను."

"చెప్పండి" మాట తడబడిందతనికి.

"ఈ వేళ సుశీల పుట్టిన రోజు పండుగ జరుపుకుంటుందంటే అది మీ చలవే!"

"ఎంత మాట! నా కూతురు లాంటిది. ఈ మాత్రం నేను చేయకూడదా?"

"చూడండి! కూతురు కూతురని మీరు చెప్పుకుంటున్నారు. నాన్నగారు నాన్నగారని సుశీల చెప్పుకుంటోంది. ఏడాది నుంచి చూస్తున్నాం!"

సుబ్బరాజు తెల్లబోయాడు. "బాబుగారూ!"

".. దానికి మేమేమీ అనుకోలేదు. పిల్ల బ్రతికింది చాలనుకున్నాం. కాని, ఈ వేళ తెల్లవారింది మొదలు సుశీల మీగురించే చెపుతోంది. అందరికి మిమ్మల్ని పరిచయం చేయాలని మీరే తండ్రని చెప్పుకోవాలని.. మనసులో ఏమనుకున్నా నాకు ఫరవాలేదు. ఇంట్లో ఏమన్నా సరిపెట్టుకుంటాను. కాని, అందర్లోను మీరే తండ్రని చెప్పుకుంటుంటే.. నాకు మనస్సెంత గాయపడుతుందో ఆలోచించండి..."

సుబ్బరాజు నిర్ఘాంతబోయాడు.

"కన్నతండ్రిని... నేనేం కావాలి? నా పరువేం కావాలి?"

సుబ్బరాజు కళ్ళల్లో నీళ్ళు చిప్పిలాయి.

"ఇప్పటికే నలుగురూ నానా మాటలూ అంటున్నారు. అయిన వాళ్ళల్లో ఎవ్వరూ చేయలేని పనిని ఎవరో పరాయి వాడొచ్చి చేసి చూపించాడని. ఇంటి నిండా దగ్గర బంధువులున్నారు. మిమ్మల్ని తీసుకువెళ్ళి "మా నాన్న గారు - నాకు ప్రాణం పోసిన దేవుడు." అంటూ అందరికీ సుశీల పరిచయం చేస్తుంటే మాకెంత సిగ్గుచేటుగా వుంటుందో మీరే ఆలోచించండి.."

అప్పుడే సుశీల మామగారు రంగారావు ఆ గదిలో అడుగుపెట్టాడు. అతని చేతుల్లో

నోట్ల కట్టలున్నాయి... "చూడండి రాజుగారూ! ఎవరి కష్టమూ మేం ముంచుకోము. అప్పుడు పదివేలిస్తామని పేపర్లో వేయించాము. మరో పది వేలు ఇప్పుడు ఎక్కువ ఇస్తున్నాను. ఇది పుచ్చుకొని మీరు సంతోషంగా వెళ్ళిరండి... మా సుశీలను మాకు దక్కనియ్యండి!" అన్నాడు.

మనిషికి ప్రాణాధారమైనది ఇస్తే పదివేలు. మమతానుబంధం త్రెంచుకోటానికి ఇరవై వేలు.... ఈ లోకంలో విలువ కట్టడానికి ప్రతిదానికీ డబ్బేనా కొలబద్ద! మనిషికి మనిషిగా ఒక మంచి చేయకూడదా? మనసుకీ మనసుకీ అనుబంధాలుండరాదా? అయ్యో! అమూల్యమైన ఈ అనుబంధానికి డబ్బుతో విలువ కట్టి ఎంత చిన్న చూపు చూస్తున్నారు? మానవతాభావం అంతస్తుల్ని అధిగమించలేకపోయిందా?

అంతులేని ఆవేదనతో అతని హృదయం ఆక్రోశించింది...జీవితంలో ఇక మిగిలిందను కున్న చివరి ఆశ కూడా చిన్నాభిన్నం అయిపోయింది. ఈసారి కూడా తనకు ఓటమి తప్పలేదు. హతాశుడైపోయాడతను. నిస్త్రాణపడి మంచినీళ్ళ గ్లాసువైపు చూసాడు.

కృష్ణస్వామి నీళ్ళందించాడు. త్రాగాడు. వాళ్ళు టిఫిను తినమన్నారు. తల అడ్డంగా త్రిప్పాడు. డబ్బు తీసుకోమన్నారు. వాళ్ళిద్దర్నీ మార్చి మార్చి చూసి "వద్దు... సుశీల మనస్సులో తండ్రిగా నాకింత చోటుంది. అది చాలు. మీకు కష్టం కలిగించను.. ఇక్కడికెప్పుడూ రాను" అని లేచాడు.

"ఉత్తరాలు?" అని కృష్ణస్వామి నసిగాడు.

"ఉత్తరాలు!... సుశీలకి ఉత్తరాలు కూడా వ్రాయను!" పగిలిన గుండె చేత పట్టుకొని ఓ అడుగు వేసాడతను. భుజానికి వ్రేలాడుతున్న సంచీ స్పృహ తెచ్చింది. దాంట్లోంచి పేకెట్టు బయటికి తీసి, కన్నీళ్ళు ఉగ్గపట్టుకుంటూ "నా ఆఖరి కోరిక. దయచేసి తీరుస్తారా? ఈ చీర తన పుట్టిన రోజు పండక్కి సుశీలకి పంపించానని చెప్పండి చాలు" అన్నాడు.

"అలాగే!"

భుజం మీద కండువాతో కళ్ళొత్తుకొని, కాళ్ళీడ్చుకుంటూ బయటకు వెళ్ళిన సుబ్బరాజు చీకటిలో కలిసిపోయాడు.

ఆ రాత్రి వేడుకలన్నీ అయిపోయాక మేడమీద పిట్టగోడ మీద నుంచి బయటికి తదేకంగా చూస్తున్న సుశీలని చేరి ".. ఏమిటిక్కడ నిలబడ్డావ్!" అని అడిగాడు ఆమె భర్త.

"నాన్నగారు రాలేదు" అంది సుశీల చిన్నబుచ్చుకున్న ముఖంతో.

"ఇంకేం వస్తారు? ఇంక రారు!" అన్నాడతను తాపీగా.

ఆమె చకితురాలైంది. ఏదో అనబోయింది. ఇంతలో పని మనిషి కాపీలు తెచ్చి పెట్టింది. ఆమెను చూసి సిగ్గుగా నవ్వింది, "ఎలా వుందమ్మగారూ చీర?" అని అడిగింది.

"బావుంది. ఎప్పుడు కొనుక్కున్నావే"?

"అదేంటమ్మా. తమకు తెల్వదా? మీ పుట్టింరోజు పండక్కని మీ అయ్యగారు నాకీ చీరెట్టారు!"

●